

ఒక అరసున్న–ఉండడం వల్లా, లేకపోవడం వల్లా, విరిసే
నానార్థాలనూ యలవర్తి రోశయ్యగారు
ఉదాహరణాత్మకంగా చెబుతూ వుండేవారు.

# మసకబారిన ముసలి గుర్తులు

## డాక్టర్ రావూరి భరద్వాజ

తాడికొండ, నా ప్రాథమిక పాఠశాల. నెల్లూరు నా ప్రాథమికోన్నత పాఠశాల. తెనాలి, నా ఉన్నత పాఠశాలైతే, మద్రాసు నా కళాశాల. ఇక-భాగ్యనగరం-నా విశ్వవిద్యాలయం.

ఇప్పుడు నేను నా ఉన్నత పాఠశాలనాటి కాసిని అనుభవాలనూ, కూసిని జ్ఞాపకాలనూ మీ ముందుంచడానికి ప్రయత్నిస్తున్నాను.

1948 చివరిభాగంలో-ఆలపాటి రవీంద్రనాథ్ గారి దయవల్ల నేను తెనాలిలో చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాను. వారికి జ్యోతి ప్రెస్ ఉండేది. దాంతోబాటు జ్యోతి, రేరాణి, సినీమా అన్న పత్రికలూ ఉండేవి. అయిదారు మాసాలైనా గడవకముందే ఓ చిన్న కారణంగా, నేను ఉద్యోగాన్ని వదిలేయవలసి వచ్చింది. రెండు మూడు మాసాలు ఖాళీగానే వున్నాను. ఆ తరువాత, నలందా ప్రెస్‌లో చేరాను. ఈ ప్రెస్సు కోగంటి రాధాకృష్ణమూర్తి గారిది. వీరిదేమో, తెనాలికి సమీపంలోని కూచిపూడి గ్రామం. ఈ ఉద్యోగం నాకు రావడానికి చాలా కృషిచేసినవారు శార్వరిగారు. 1949 నుండి 1955 వరకూ నలందా ప్రెస్సులో రకరకాల ''హోదా''లలో పనిచేశాను. ఆ రోజుల్లో, కోగంటివారు ''సమీక్ష'' అన్న మాసపత్రికను కూడా ప్రచురిస్తూ ఉండేవారు. నేనా పత్రిక ''పనులు'' చూస్తూ

ఉండేవాణ్ణి. ఈ పత్రిక కారణంగానూ, నలందా ప్రెస్ కారణంగానూ, నాకు చాలామందితో పరిచయాలేర్పడ్డాయి. శ్రీయుతులు జి.వి. కృష్ణారావు, పి.వి. సుబ్బారావు, ఆవుల గోపాలకృష్ణమూర్తి, మేకా చక్రపాణి, ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రి, పెనుమర్తి కామేశ్వరరావు, ఈదర లక్ష్మీనారాయణ, నన్నపనేని సుబ్బారావు, రావిపూడి వెంకటాద్రి, వేదాల తిరువెంగళాచారి, తెలికిచర్ల వెంకటరత్నం, జమ్ములమడక మాధవరాయశర్మ, జంధ్యాల పాపయ్యశాస్త్రి, ఎలవర్తి రోశయ్య వంటి ఉద్దండ పండితులతోనూ కాస్త దగ్గర పరిచయాలయ్యాయి.

తాళ్ళూరి నాగేశ్వరరావు, వెలగా వెంకటప్పయ్య, కవిరావు, హితశ్రీ, కొత్త సూర్యనారాయణ వంటి యువ రచయితలతోనూ మరింత దగ్గరి పరిచయాలయ్యాయి.

నలందా ప్రెస్సు-ఒక ముద్రణాలయం మాత్రమేకాదు; అదో విద్వత్సభలాగా ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉండేది. మంచి మంచి పుస్తకాలను మేము చాలా అచ్చువేశాం. అందులోను-తప్పులు లేకుండా-అచ్చుతప్పులు లేకుండా చేయడం నలందావారి ప్రత్యేకత.

వేదాల తిరువెంగళాచార్యులవారి ''ఆంధ్ర ధ్వన్యాలోకం'' నలందా ప్రెస్సులోనే అచ్చయింది. జి.వి. కృష్ణారావుగారి ''కీలుబొమ్మలు'' నవల కూడా అక్కడే అచ్చయింది. రావిపూడి వెంకటాద్రి గారి ''జీవమంటే ఏమిటి'' అన్న పుస్తకానికి మరికొన్ని పుస్తకాలకు, ముద్రాపకులం, ప్రచురణకర్తలం కూడా మేమే. ఇల్లాగా-ఎందరెందరు పెద్దలతోనో కలిసి బతికిన బంగారు రోజులవి. యలవర్తి రోశయ్య గారితోనూ నాకు అప్పుడే పరిచయమయింది!

మనిషి-కొంచెం ఎత్తుగానూ, కాస్త బొద్దుగానూ ఉండేవారు.

ఉండడం గుంటూరులో. అచ్చుపని మాత్రం తెనాలిలో.

ఒక్కోసారి తిరువెంగళాచారి గారు, రోశయ్యగారు, ఒకే బండిలో గుంటూరు నుండి వచ్చేవారు. ఉభయులూ బాగా చదువుకున్నవారే! ఉభయులూ గ్రాంథిక భాషాప్రియులే!

ఓపక్క జి.వి. కృష్ణారావుగారూ, ప్రయాగ కోదండరామ శాస్త్రిగారూ ఉంటే, మరోపక్క వేదాల తిరువెంగళాచారి గారూ, ఎలవర్తి రోశయ్యగారూ ఉండేవారు. మొదటివారిద్దరూ వ్యావహారిక భాషావాదులయితే, ఇవతలి వారిద్దరూ శుద్ధ గ్రాంథికవాదులు. జి.వి. కృష్ణారావుగారు శిష్ట వ్యావహారిక భాషావాదులయితే, ప్రయాగవారు మామూలు వ్యావహారిక భాషావాదులు.

ఒక శబ్దాన్ని గురించి, ఒక చిన్న వాక్యాన్ని గురించి, అరసున్నాను గురించి, ''ఱ'' (బండి ర ను) గురించి రోజులకొద్దీ సాగిన చర్చలు, లీలగా నాకింకా గుర్తున్నాయి. ఒక అరసున్న ఉండడం వల్లా, లేకపోవడం వల్లా, విరిసే నానార్థాలనూ; ఎలవర్తి రోశయ్యగారు, ఉదాహరణాత్మకంగా చెబుతూ వుండేవారు.

''జలం'' అన్న అర్థంలో ''నీరు'' అని రాయాలిట. ''నీఱు'' అని రాస్తే 'బూడిద' అని అర్థమట. ''ఊరు'' అంటే ''గ్రామం'' అని అర్థమైతే, ''ఊఱు'' అని రాస్తే ఇంకేదో అర్థమట. ''అర్థం'' అన్న పదంలో ''ర'' కింద వత్తు తా వత్తు '' '' చేర్చితేనే, ''డబ్బు, భావం'' లాంటి అర్థాలుంటాయట. ''సగం'' అని రాయదలుచుకున్నప్పుడు ''అర్ధం'' అని రాయవచ్చు గానీ ''ర''కు వత్తు '' ధ'' వత్తు ఇవ్వాలిట. అంటే ఈ వత్తుగారికి పొట్టలో చుక్కలుండగూడదు. ఇక అరసున్నాలను గురించి ఎన్నో చెప్పారు.

''అమ్మ'' అని రాస్తారు గానీ, ''అంమ'' అని ఎందుకు రాయరని, రోశయ్య గారడిగారు. ప్రయాగవారేదో చెప్పారు.

జయపురం సంస్థానంలో ఆస్థానకవిగా ఉన్న త్రిపురాన వేంకటసూర్య ప్రసాదరాయ వర్మగారి ''మొయిలు రాయబారము'' పద్యకృతిని గురించి ఎలవర్తి వారికి ఉన్నతోన్నతమైన ఆదరాభిమానాలుండేవి.

''తంత్రీ! తమ్మయ గ్రమణీ!'' అన్న మకుటంతో (అదేనని జ్ఞాపకం) త్రిపురాన వారి శతకాన్ని నలందా ప్రెస్సులోనే ముద్రించారు రోశయ్యగారు.

సాహిత్యపరంగా ఎన్ని వాదోపవాదాలు జరిగినా, చివరికి అందరూ హాయిగా నవ్వుకునేవారం. అటు సీతమ్మగారి హోటలుకో, ఇటు అంబుమ్మగారి హోటలుకో వెళ్ళి భోజనాలు చేసేవాళ్ళం!

ఎంత రుచ్యమైన అనుభవాలవి!!

ఎంతమంచి రోజులవి!

# అభినుతి

## విద్వాన్ యం.వి.ఆర్. శర్మ

ప్రథిత సంస్కృతాంధ్రాంగ్లాది భాషలందు
బండితుండు, చంచద్యశోమండితుండు
కలితగుణ పేటి బుధకోటి కల్పవాటి
అనఘుడే, యలవర్తిరోశయ్యఘనుడు,

పరమోదావిజిచారభావకలనా పాండిత్య సాహిత్యధీ
గరిమన్ హేమమునందు గ్రాంతివలెను ద్గాఢమ్ముఠాజిల్లియున్
సరసానందమనమ్ము కస్తురిక జం చద్గంధమున జందమై
వరలంగల్గిన రోశయాఖ్య వివరింపన్ సాధ్యమే తధ్యమున్
విద్యావేత్త, మహోన్నతాశయగుణ ప్రేమానుబద్ధుండు, సం
వేద్యుండద్భుత సద్గురూత్తము డుల సద్విఖ్యాత సంపూర్ణుడున్
ఉద్యచ్ఛిత్త సమన్వితుండిన ఘనుండుత్తేజ సద్భావనా
వేద్యుండౌ పథరోశయా ఖ్యుడలరున్ వేనోళ్ళ గుర్తింపగన్
ఘను డుత్తమగుణు డున్నత మనస్కుడు బంధుండు
విబుధమాన్యుడు, గురుసజ్జనసత్తమోత్తముండున్
గణనీయుడు రోశయాఖ్యగణుతింతుమదిన్